

ఆసుపత్రిలో నర్సింగ్ సేవలు అనిర్వచనీయమైనవి, అమోఘమైనవిగా చెప్పవచ్చు.నేడు అంతర్జాతీయ నర్సెస్ దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారి సేవలను స్మరించుకుందాం. నేడు నర్సు అనే వ్యక్తి లేకుంటే వైద్య సేవలు ముందుకు సాగవు. ఆమె ఆసుపత్రి లో, పిహెచ్‌సి, సిహెచ్‌సి, ప్రభుత్వ ప్రైవేటు పాస్పత్రులలోను ప్రతిచోటా నర్సుపాత్ర కీలకమే. ఆసుపత్రుల్లో డాక్టర్ లేకపోయినా నర్సులే వైద్య సేవలు ఇస్తుంటారు. సేవల్లో అమ్మలాగా.. ఉంటూ ఆరోగ్య సేవలు అందిస్తుంటారు.

ఆమె సేవలు అనిర్వచనీయం

- సమస్యల సుడిగుండంలో స్టాఫ్ నర్సులు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఫ్లారెన్స్ నైటింగేల్ చేసిన అద్భుతమైన పని కారణంగా మే 12 నర్సుల సహకారాన్ని స్మరించుకునే రోజుగా ఎంపిక చేశారు. 1820 మే 12న జన్మించిన ఫ్లారెన్స్ నైటింగేల్ బ్రిటీష్‌నర్సు, సంఘ సంస్కర్త. ఆమెను 'ది లేడీ విత్ ది ల్యాంప్'గా గౌరవించారు. 1850లలో క్రిమియన్ యుద్ధం సమయంలో, ఫ్లారెన్స్ నైటింగేల్‌నర్సుగా ఎనలేని సేవలు అందించారు. గాయపడిన బ్రిటీష్ సైనికులను చూసుకునే నర్సుల బృందానికి ఆమె బాధ్యత వహించే ఆసుపత్రిలో పనిచేసారు. ఆమె మొదట ఆసుపత్రికి వచ్చినప్పుడు, సౌకర్యాలు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో చూసి ఆశ్చర్యపోయారు. వెంటనే ఆమె ఆసుపత్రి వార్డులను శుభ్రంగా వుంచేందుకు చర్యలు తీసుకున్నారు. ఆహారం-వైద్య సామాగ్రిని రోగులకు ఎల్లవేళలా అందుబాటులో వుండేవిధంగా నిల్వ ఉండేలా చూసుకున్నారు. అంతటి అద్భుతమైన సేవలు అందించడమే కాకుండా 1860లో లండన్‌లోని నైటింగేల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌కు పునాది వేశారు. ఆస్పత్రిలో చేరిన రోగులకు వారి శారీరక అవసరాలను నిర్వహించడానికి, ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా చికిత్స చేయడానికి నర్సులు ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. అనారోగ్యాలను నివారించడానికి వారికి సంరక్షణ అందించడంలో నర్సుల పాత్ర వెలకట్టలేనిది.

నర్సిలతో వెట్టిచాకిరీ : ఎన్నో ఏళ్లుగా నర్సులు వెట్టి చాకిరీకి గురౌతున్నారు. పిహెచ్‌సపి, సిహెచ్‌సిలలో 24/7 పేరుతో వీరికి సెలవులు, వీక్లీ ఆఫ్ అనేది కూడా లేకుండా వీరితో పని చేయించుకుంటున్నారు. ఆసుపత్రులలో వైద్యులు లేకపోయినా వీరే దగ్గరుండి రోగులకు స్టాఫ్ నర్సిలు సేవలు అందిస్తున్నారు. ప్రసవాలు చేసేటప్పుడు పక్కన వైద్యులు లేక పోయిన ఎంతో రిస్క్ చేసి కాన్పులు చేస్తుంటారు. అలాంటి వారి బాధలు వర్ణనాతీతం.. అనేక ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్దతిన విధులు నిర్వహిస్తున్న వారిని ఇంత వరకు ప్రభుత్వాలు రెగ్యులర్ చేయడం లేదు.. విధులు చేసే చోట వారికి రక్షణ లేదు. అనేక రకాల విధింపులకు గురౌతున్నారు. వైద్యులకు, పారామెడికల్ సిబ్బందికి ప్రభుత్వ సెలవులు వర్తిస్తాయి కానీ స్టాఫ్ నర్సులకు మాత్రం సెలవులు వర్తించక పోవడం బాధాకరం. పిహెచ్‌సి, సిహెచ్‌సిలలో ఆదివారం కూడా విధులు నిర్వహించాల్సిందే. ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండే పిహెచ్‌సిలలోనైతే ఓ స్టాఫ్ నర్సు సెలవు తీసుకుంటే ఉన్న ఇద్దరు నర్సులు 12 గంటలు విధుల్లో ఉండాల్సిందే. అంటే దాదాపు నాలుగు గంటలు అదనంగా మెడికల్ అధికారులు నర్సులతో పని చేయిస్తున్నారు. అన్యాయం అని అడిగిన నర్సులను మరి దారుణంగా వేడిస్తున్న సంఘటనలు జిల్లాలో అనేకం..విధులు నిర్వహించే చోట నర్సులకు సరైన సౌకర్యాలు ఉండటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులను తక్షణమే రెగ్యులర్ చేయాలని నర్సులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా వారి మొర వినే నాధుడు కరువయ్యారు.

చిత్తశుద్ధితో రోగుల సేవే లక్ష్యం

- సోమేశ్వరి ,స్టాఫ్ నర్స్ జి జి హెచ్ కర్నూలు



రోగులకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య చికిత్సలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఆసుపత్రిలో అలర్ట్ చేసిన వార్డులోని పేషంట్లను పలకరిస్తూ వారి పరిస్థితి తెలుసుకుంటాం. మందులు ఇంజక్షన్లు , ఆహారాన్ని సమయానికి అందిస్తాం. ఇంకా వారి మానసిక శారీరక పరిస్థితి అంచనాలు వేస్తూ ఉన్నత వైద్యాధికారులకు, నర్సింగ్ సూపర్వైజర్లకు తెలపడం కర్తవ్యం. ప్రతిరోజు షిఫ్ట్ డ్యూటీలో ఎనిమిది గంటల సమయం కేటాయిస్తూ జూనియర్ స్టాఫ్ నర్స్‌తో హెడ్‌నర్సులతో నర్సింగ్ విద్యార్థులతో సమన్వయంతో పనులు చేయిస్తూ రోగులను ఆరోగ్యవంతులను చేస్తాం. డిశ్చార్జి అయ్యేవరకు బాధ్యతగా ఉంటాం. ఆసుపత్రిలో వైద్యాధికారులు నర్సింగ్ అధికారుల సహాయ సహకారాలతో స్టాఫ్ నర్సు, విధి నిర్వహణలో ముందుకు సాగుతున్నాం.

స్టాఫ్ నర్సులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఎపి ప్రభుత్వ నర్సే స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డి మంజుల దేవి



రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఏళ్ల నుండి పనిచేస్తున్న స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి. నర్సులు వెట్టిచాకిరీకి గురౌతున్నారు. వెట్టి చాకిరీ నుండి విముక్తి కల్పించాలి. విధులు నిర్వహించే చోట స్టాఫ్ నర్సులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. పిహెచ్‌సిలలో నైట్ వాచ్‌మన్‌ను ఏర్పాటు చేయాలి. స్వీపర్స్ పోస్టులు భర్తీ చేయాలి. స్వీపర్ పోస్టులు ఖాళీ ఉండటంతో స్టాఫ్ నర్సులతోనే పని చేయిస్తున్నారు. స్కూల్ ఆఫ్ నర్సింగులలోనూ, కాలేజీ ఆఫ్ నర్సింగులలోనూ సీనియర్టీ ప్రకారం బోధనకు స్టాఫ్‌నర్సులను వినియోగించుకోవాలి.

104 సేవలను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా నిర్వహించాలి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

104 సేవలను రాష్ట్ర ప్రభుత్వం గతంలో వలె నేరుగా నిర్వహించాలని 104 యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.కష్ణారెడ్డి డిమాండ్ చేశారు. 104 ఉద్యోగులను ఆప్కాస్ లో నేరుగా విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం కర్నూలు డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ బి.రామగిడ్డయ్యకు వినతి పత్రం అందజేశారు. ఆదోనిలో నోడల్ ఆఫీసర్‌కు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా పెండింగులో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. జీవో నెంబర్ 44, 59 ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని, 104 యాజమాన్యం అయిన అరబిందో సంస్థనే నేరుగా ఎంప్లాయర్ కాంట్రిబ్యూషన్ నిధిని చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులకు వారు నివాసం ఉంటున్న స్థానిక ప్రదేశాలకు బదిలీ అవకాశం కల్పించాలని కోరారు. వాహనాలకు సకాలంలో క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించాలని వాహనాలకు ఫిట్నెస్ ,ఇన్సూరెన్స్ చేయించాలని ఉద్యోగులకు గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. న్యాయమైన డిమాండ్ల కోసం 15న జరిగే రాష్ట్ర కమిటీ సమావేశం అనంతరం ఉద్యమ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని ఆందోళన బాటలో పయనిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, రాజు, వీరేష్, అబ్దుల్ నబీ. వీరారెడ్డి పాల్గొన్నారు.



డిఎంహెచ్‌ఒకు వినతి పత్రం అందజేస్తున్న 104 యూనియన్ నాయకులు

ఎస్‌పిని కలిసిన ఆదోని డిఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

జిల్లాపోలీస్ బాస్‌ను ఆదోని డివిజన్ డిఎస్‌పి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన డిఎస్‌పి బదిలీల్లో ఆదోనిడిఎస్‌పిగా నియమితులైన శివనారాయణస్వామి భాద్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంత్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.



వినతుల వెల్లువ

- దారిపొడవునా ఆత్మీయ స్వాగతం
- నందికొట్కూరు నియోజకవర్గంలో యువగళం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/నందికొట్కూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 96వ రోజు నందికొట్కూరు నియోజకవర్గంలో ఉత్సాహంగా సాగింది. దారి పొడవునా వివిధ గ్రామాల ప్రజలు లోకేష్‌కు స్వాగతం పలికి తాము ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. నందికొట్కూరు శివారు క్యాంప్ సైట్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర తార్తూరు, మండ్లెం, తంగడంచ, జూపాడు బంగ్లా, తాటిపాడు, తరిగొప్పుల క్రాస్ మీదుగా బన్నూరు చేరుకుంది. మండ్లెం గ్రామంలో సాగునీటి కోసం జలదీక్ష చేస్తున్న గ్రామ రైతులకు యువనేత నారా లోకేష్ సంఘీభావం తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మండ్లెం ప్రాంతంలో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి, సాగునీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మధ్యాహ్నం తంగడంచ వద్ద భోజన విరామ సమయంలో బిసిలతో సమావేశమై వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. తంగడంచ వద్ద గత ప్రభుత్వ హయాంలో భూములు కేటాయించిన జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టు వద్ద సెల్ఫీ దిగిన లోకేష్... వేలాది మందికి ఉపాధి కల్పించే ఆ ప్రాజెక్టు జగన్ రెడ్డి ప్రభుత్వ ప్రోత్సాహం లేక వెళ్లిపోయిందని చెప్పారు. పాదయాత్ర దారిలో యాదవులు, రైతులు, బిసిలు యువనేతను కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు.

విధ్వంసక పాలనకు సజీవసాక్షి జైన్ ఇరిగేషన్

తంగెడంచ వద్ద నిలిచిపోయిన జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టు వద్ద సెల్ఫీ దిగిన లోకేష్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. విధ్వంసక పాలకుడు, జగన్ వినాశక చర్యలకు ప్రత్యక్షసాక్షి నందికొట్కూరు నియోజకవర్గం తంగెడంచలో నిలచిపోయిన జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టు అని తెలిపారు. రైతులకు అధునాతన వ్యవసాయ పరికరాలు అందించడంతోపాటు కరువు సీమలో యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో చంద్రబాబు గారి ఆహ్వానం మేరకు అప్పట్లో స్వర్గీయ భవర్ లాల్ జైన్ తంగెడంచలో ప్రాజెక్టు ఏర్పాటుకు ముందుకు వచ్చారన్నారు. గత ప్రభుత్వంలో ఇందుకోసం 623 ఎకరాల భూమి కూడా కేటాయించారని, అనుకున్న ప్రకారం ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్ర రైతాంగం జీవన స్థితిగతులు మారిపోయేవని పేర్కొన్నారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సహకారం లేకపోవడంతో జైన్ ప్రాజెక్టు నిలచిపోయిందన్నారు. పాదయాత్రలో మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, భూమా అఖిల ప్రియ, టిడిపి జిల్లా ఇంఛార్జి గౌరు వెంకటరెడ్డి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పార్వతమ్మ, నియోజకవర్గ ఇంచార్జి మాండ్ర శివానంద రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారా లోకేష్



వినతులు స్వీకరిస్తున్న నారా లోకేష్

13 న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -కర్నూలు లీగల్ : జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో ఈనెల 13న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సిహెచ్.వెంకట నాగ శ్రీనివాసరావు ప్రజలను కోరారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, ఎన్.శ్రీనివాసరావు ఆదేశాలతో ప్రజలకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కోర్టు, మున్సిఫ్ కోర్టు ప్రాంగణంలో , మండల న్యాయ సేవాధికార సంస్థ ఆయా కోర్టు ప్రాంగణాలలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలన్నారు. అత్యధిక కేసులు పరిష్కరించేలా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా ఇరుపక్షాలు విజయం సాధించినట్లు అవుతుందని అన్నారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటరు వాహన ప్రమాద బీమా కేసులు, చెక్‌బౌన్సు కేసులు, బ్యాంక్ కేసులు , ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించు కోవాలన్నారు.

కౌలు రైతు సదస్సును సద్వినియోగం చేసుకొండి : ఎఒ

ప్రజాశక్తి -సి బెళగల్

సి బెళగల్ మండలంలో ఈ నెల 8 నుండి 18 వరకు చేపట్టే కౌలు రైతుల సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎఒ మల్లేష్‌కుమార్ కౌలు రైతులకు సూచించారు. గురువారం బెళగల్-3, బంరాన్ దొడ్డి - 1 రైతుభరోసా కేంద్రాలలో సదస్సులు నిర్వహించారు. కౌలు హక్కులు పొందెందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర రైతు సమస్యలు ఉంటే తెలపాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎఒ

హంద్రీలో కరెంటు స్తంభాల ఏర్పాటు

ప్రజాశక్తి-కోడుమూరు

కోడుమూరుకు నీటి సరఫరాకు హంద్రిలో మోటార్ల ద్వారా ట్యాంకులకు అక్కడి నుండి ఇండ్లకు సరఫరా చేస్తున్నామని సర్పంచి భాగ్యరత్న తెలిపారు. అయితే హంద్రిలో మోటార్లకు వైర్లు హంద్రి నదిలో ఇసుక పైన నుండే కరెంట్ సప్లయ్ ఉండేదిని, దీని వలన వర్ష కాలం నీరు ఎక్కువ వచ్చినప్పుడు వైర్లు తెగిపోవడం, చేపలు కొరకడం అదేవిధంగా ఆక తాయిలు వైర్లను తెంచి వేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. దీనివలన ప్రమాదం పొంచి ఉందన్నారు. గమనించిన గ్రామ పంచాయతీ వాటర్ వర్కర్స్, సర్పంచిభాగ్య రత్న, ఇఒ అజయ్ భాస్కర్ దృష్టికి తీసుకురాగ కరెంట్ ఎఇ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇతో మాట్లాడి కరెంట్ స్థంబాలు ఏర్పాటు చేశారు. దీని వలన పశువులకు, అధిక నీటి వలన ఎలాంటి ఇబ్బంది ఉండదని సర్పంచి భాగ్యరత్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు ఉదయం హంద్రిలో జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు.



ప్రభుత్వ కాటాలు ఏమైనట్లు..?

రెవిన్యూ పర్యవేక్షణ అధికారులపై చర్యలు తీసుకోవాలి: ప్రజాసంఘాలు

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ పట్టణంలోని ఎండియు వాహనాల్లో రేషన్ పంపిణీ చేసే ప్రభుత్వ కాటాలు ఏమైనట్లని ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి తాజ్ మహమ్మద్, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గిత్తారి రమేష్ ప్రశ్నించారు. ఈశ్వర్ రెడ్డి భవనంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలని ఎండియు వాహనాలను ఏర్పాటుచేసి, కావాల్సిన పరికరాలను అందజేసింది. పత్తికొండ మండలానికి 11 ఎండియు వాహనాలను పంపిణీ చేశారు. ఎండియు వాహనదారులు ప్రభుత్వ కాటాలను పక్కనపెట్టి సొంత కాటాలను ఏర్పాటు చేసుకొని రేషన్ పంపిణీ చేస్తూ ఉంటే రెవెన్యూ పర్యవేక్షణ అధికారులు ఉన్నట్లా లేనట్లా అని అధికారులపై మండిపడ్డారు. ఎండియు వాహనదారులు రేషన్ బియ్యాన్ని ప్రజలకు సక్రమంగా పంపిణీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు కార్డుదారుల పట్ల అసభ్యంగా పదజాలంతో మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ పర్యవేక్షణ అధికారులు కానీ ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడంలేదని, ఎండియు వాహనదారులు ఇచ్చే మామూలుకు అలవాటు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు రెవెన్యూ పరిషన్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎండియు వాహనాలను తనిఖీ చేసి ప్రభుత్వ కాటాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్‌సి వర్గీకరణ చేయడంలో పాలకులు విఫలం

ప్రజాశక్తి-తుగ్గలి : ఎస్సీలను ఎబిసిడిలుగా వర్గీకరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం అయ్యాయని మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, ఎంఎస్‌పి జిల్లాకో కన్వీనర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలం పరిధిలోని వివిధ గ్రామంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణ చేస్తామని మాదిగల ఓట్లు వేయించుకొని గద్దె నెక్కిన తర్వాత చేయకపోవడం విచారకరమన్నారు. యేళ్లతరబడి రాష్ట్రంలో ఎస్సీలను ఎబిసిడిలుగా విభజించాలని కోరుతూ రాస్తారోకో, ఆందోళన చేసినా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. గత 50 రోజుల నుండి గ్రామాల్లో పల్లె బాట కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు పులికొండ, రవికుమార్, మారెళ్ళ అంజి, గ్రామ నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీరాములు

ఆటోకు నిప్పుపెట్టిన వారిని కఠినంగా శిక్షించాలి

ఎపి ఆటో ట్రాలీ, ఫోర్ వీలర్ డ్రైవర్స్ యూనియన్ సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్ : ఓల్డ్ సిటీలోని మాసూంబాష దర్గా సమీపంలో ఉన్న మున్నా ఆటో కార్మికుడు ఆటో నడుపుకుంటూ తన కుటుంబంతో జీవిస్తున్నారు. రోజులాగే బుధవారం రాత్రిఆటో నడుపుకొని రాత్రి పదిన్నరకు ఇంటి ముందర పార్కింగ్ చేసి పడుకున్నారు. అర్ధరాత్రి ఒకటిన్నర ప్రాంతంలో తాగుబోతులు తన ఆటోకు నిప్పుపెట్టారు. ఈ విషయం ఆటో కార్మికులు యూనియన్ నాయకులకు సమాచారం అందించారు. యూనియన్ నాయకులు దూదెకొండ కుమార్, నూర్ బాషా, మాసంబాష, దర్గా ఆటో స్టాండ్ నాయకులు నాసిర్‌ఖాజా ఇలియాస్ సంఘటన స్థలానికి వెళ్లి ఆటోను పరిశీలించారు. ఉపాధి కోల్పోయి రోధిస్తున్న కుటుంబాన్ని చూసి వారి కుటుంబాన్ని ఓదార్చి ధైర్యంగా ఉండండని చెప్పారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోకు నిప్పు పెట్టిన వ్యక్తిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆటో కార్మికుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఆటోకు నిప్పు పెట్టిన వారి నుంచి నష్టపరిహారం ఇప్పించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. తన జీవనధారమైన ఆటోకు నిప్పు పెట్టడం వల్ల ఆటో కార్మికుని కుటుంబం రోడ్డున పడిందని ఆటో కార్మికుడికి తక్షణమే సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



కాలిన ఆటోను పరిశీలిస్తున్న యూనియన్ నాయకులు

ఎల్లార్తి, హోళగుందకు ఆల్ట్రా పల్లెవెలుగు బస్సు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆర్‌టిసి కర్నూలు-1 డిపో నుండి నూతన అల్ట్రా పల్లెవెలుగు సర్వీసును కర్నూలు నుండి ఎల్లార్తి, హోళగుంద పుణ్యక్షేత్రాలకు గురువారం జిల్లా ప్రజారవాణా అధికారి టేకి వెంకటరామం ప్రారంభించారు. ఈ బస్సు కర్నూలులో సాయంత్రం 4.00 గంటలకు బయలుదేరి నాగలాపురం, కోడుమూరు, దేవనకొండ, పత్తికొండ, ఆస్పరి, ఆలూరు , ఎల్లార్తి తదితర గ్రామాల మీదుగా హోళగుందకు రాత్రి 08.15 గంటలకు చేరుతుందని తెలిపారు. హోళగుందలో ఉదయం 5.00 గంటలకు బయలుదేరి కర్నూలుకు ఉదయం 09.15 గంటలకు చేరుతాయన్నారు. కర్నూలు నుండి ఎల్లార్తికి పెద్దలకు రూ. 170 ,పిల్లలకు రూ.85, కర్నూలు నుండి హోళగుందకు పెద్దలకు రూ.180 పిల్లలకు రూ.90 చార్జి ఉంటుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే సుధాకర్

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ గురువారం కర్నూలు మండలంలోని నూతనపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని గడపగడపకు తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశించారు. జగనన్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ, జడ్‌పిటిసి ప్రసన్నకుమార్, పసుపుల సొసైటీ చైర్మన్ శేషారెడ్డి, వైసిపి మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీని పరిశీలించిన ఇఒఆర్‌డి

ప్రజాశక్తి- సి బెళగల్

సి బెళగల్ మండలం పోలకల్‌లో ఇఒఆర్‌డి సందీప్ గురువారం డ్రైనేజీని పరిశీలించారు. చెత్త చెదారంను ఎప్పటి కప్పుడు ఎత్తివేసి అక్కడే బ్లీచింగ్ పౌడర్ లాంటివి చెల్లించి ప్రజారోగ్యం కాపాడాల్సిన బాధ్యత మనకుందని పంచాయతీ సిబ్బందికి సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులతో పేర్కొన్నారు.



'మాచాని' స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు


జగన్మోహన్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో ఉన్న మాచాని సోమప్ప ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అజిత్, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. గురువారం వైసిపి నాయకులు జగన్మోహన రెడ్డికి, ఎంఇఒ ఖాళీ కుర్చీకి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అజిత్ మాట్లాడారు. మాచాని సోమప్ప ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గత కొన్నేళ్లుగా అడ్మిషన్లను ఇష్టానుసారంగా అమ్ముకుంటున్నారని తెలిపారు. ఫీజుల పేరుతో పేద విద్యార్థుల దగ్గర రూ.వేలకు వేలు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పేద విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను స్కూల్‌లో చేర్పించడానికి వెళితే 'మా దగ్గర సీట్లు లేవు. మేము ఇవ్వం. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి' అని స్కూలు యాజమాన్యం, హెచ్‌ఎం నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు ఆదర్శనీయుడైన పద్మశ్రీ మాచాని సోమప్ప పేరును స్కూల్‌కు పెట్టుకుని పేద విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వకుండా హెచ్‌ఎం, యాజమాన్యం నిరాకరిస్తున్నారని చెప్పారు. ఎంఇఒ ఆంజనేయులుకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా స్పందించడం లేదన్నారు. స్కూల్‌లో జరుగుతున్న అడ్మిషన్ల గోల్‌మాల్ గురించి వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డికి వివరించారు. ఆయన స్పందిస్తూ... స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి పేద విద్యార్థులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కలెక్టర్ పర్యటనతో స్పందించిన ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కొందరి వైద్యుల నిర్వాకం వల్ల చెడ్డ పేరు వస్తోందని, పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. గురువారం ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అభివృద్ధి సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ లింగన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. చికిత్స కోసం వచ్చిన రోగులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రోగులకు బెడ్ల కొరత రాకుండా, ప్రత్యామ్నాయంగా మంచాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్యులు పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఉన్నారు.

నాలుగు రథోత్సవాల్లో ఊరేగిన రాఘవేంద్రులు


రథోత్సవం నిర్వహిస్తున్న పీఠాధిపతులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామి నాలుగు రథోత్సవాలపై ఊరేగి భక్తులకు కనువిందు కలిగించారు. గురువారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయానికి వచ్చిన భక్తులు వెండి గజారోహణ, కొయ్య, స్వర్ణ, నవరత్న స్వర్ణ రథోత్సవాల సేవలను చేయించారు. ఈ సందర్భంగా రథోత్సవ సేవలు చేయించిన భక్తులతో సంకల్పం చేయించి భక్తులకు రథం లాగేందుకు అవకాశం కల్పించారు. ఉత్సవ మూర్తి అయిన ప్రహ్లాదరాయులు రథోత్సవాలపై అధిష్ఠింపజేసి పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో వైభవంగా ఊరేగించారు.

కొనసాగుతున్న ఉచిత పశు వైద్య శిబిరం


పశువులకు పరీక్షలు నిర్వహిస్తున్న పశువైద్యులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలో ఉచిత పశువైద్య శిబిరం కొనసాగుతోంది. గురువారం మండలంలోని వెంకటగిరి గ్రామంలో ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన పథకం కింద పశువులకు ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడారు. పికెఎస్‌ఎం-2.0 పథకం కింద పశుసంవర్ధక శాఖ తరుపున పశువులకు చికిత్స అందించి ఉచిత మందులు ఇచ్చినట్లు తెలిపారు. వాటర్‌షెడ్ టిఎ శివ, గోపాలమిత్ర నల్లన్న, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ పవన్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మీ వల్ల ఆస్పత్రికి చెడ్డ పేరు...

- దండం పెడతా రిజైన్ చేయండి
- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆగ్రహం
- ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగేలా విధులు నిర్వర్తించాలని సూచన



ప్రజాశక్తి - ఆదోని

'మీ వల్ల ఆస్పత్రికి చెడ్డ పేరు వస్తోంది. దండం పెడతాం. విధులకు రిజైన్ చేసి వెళ్లాల'ని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగేలా వైద్యులు, సిబ్బంది విధులు నిర్వహించాలని సూచించారు. గురువారం ఆదోని ఏరియా ఆస్పత్రిలో సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాత్రి వేళల్లో విధులకు డుమ్మా కొట్టి ప్రయివేట్‌గా ప్రాక్టీస్ చేయడం ఏమిటని డాక్టర్ ఆది నాగేష్, డాక్టర్ వినయ్‌పై ఎమ్మెల్యే సమావేశంలో ఆక్రోశం వెల్లగక్కారు. వైద్యుల కొరత రాకుండా నియామకం చేపట్టినా, ఎందుకు సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదంటూ మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆస్పత్రిలో నిర్మాణంలో ఉన్న పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. శానిటేషన్‌పై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. గతంలో కంటే అధునిక పరికరాలు, ఆక్సిజన్ ప్లాంట్, ఆల్ట్రా సౌండ్, బ్లడ్ బ్యాంక్, వివిధ సదుపాయాలు ఏర్పాటు చేశామని చెప్పారు. భవిష్యత్తులో మెడికల్ కళాశాల పూర్తయ్యే సరికి ఆదోని డివిజన్‌లోని మండలాలు, గ్రామాలకు వైద్య కేంద్రంగా మారుతుందన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడారు. ప్రతి నెలా అభివృద్ధి కమిటీ పర్యవేక్షించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతివారం ఆస్పత్రిలో తనిఖీలు చేపట్టి, చెక్ లిస్ట్ తయారు చేసి నివేదికలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వైద్యులు సమన్వయం పాటించి అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఇన్‌ఛార్జీ డిప్యూటీ డిఎంహెచ్‌ఒ బాల మురళీ, అభివృద్ధి కమిటీ సభ్యులు గోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, శోభ లత, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న, డాక్టర్ పద్మ కుమార్, డాక్టర్ నవీన్, డాక్టర్ ఆది నాగేష్, డాక్టర్ రవికుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నేడు నేమకల్లుకు కార్మిక శాఖ మంత్రి రాక

- ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్, వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ


మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం శుక్రవారం మండలంలోని నేమకల్లు గ్రామానికి వస్తున్నట్లు మార్కెట్ యార్డు ఛైర్మన్, వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేమకల్లు గ్రామంలో వైసిపి ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు తలారి నాగరాజు సోదరుని వివాహ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. మండలంలోని వైసిపి ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. సర్పంచి ప్రేమ్ కుమార్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నాగరాజు, వైసిపి సీనియర్ నాయకులు డాక్టర్ వీరాంజనేయులు, సంగాల గురునాథ్ పాల్గొన్నారు.

కురువ సాధికార కమిటీ

కర్నూలు పార్లమెంట్ సభ్యునిగా వెంకటేష్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

కర్నూలు పార్లమెంట్ కురువ సాధికార కమిటీ సభ్యులుగా తనను ఎన్నుకునేందుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డిని గురువారం ఆయన స్వగృహంలో కె.తిమ్మాపురం కెటి.వెంకటేష్ సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడారు. తనపై నమ్మకముంచి, తన సేవలను గుర్తించి కురువ సాధికార కమిటీలో సముచిత స్థానం కల్పించినందుకు బీవీకి రుణపడి ఉంటామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీవీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. 2024లో టిడిపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు శక్తికి మించి పని చేస్తామని పేర్కొన్నారు. టిడిపి మండల కమిటీ సభ్యులు, కురువ కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటేశ్‌ను సన్మానించిన నాయకులు

కర్నూలు పార్లమెంట్ కురవ సాధికారిక కమిటీలో తిమ్మాపురం గ్రామానికి చెందిన వెంకటేష్‌కు సముచిత స్థానం కల్పించినందుకు మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మాదాసి నాగరాజు, టిడిపి మండల నాయకులు బనవాసి కురువ అయ్యాలప్ప, చెన్నాపురం నాగరాజులు బీవీకి ధన్యవాదాలు తెలిపారు. వెంకటేష్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. నాయకులు బనవాసి నరసింహులు, పెసలదిన్నె హనుమంతు, బనవాసి వీరనాగప్ప పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే బీవీని సన్మానిస్తున్న నాయకులు

రామేశ్వర రెడ్డిని అరెస్టు చేయాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని అగ్రహారం గ్రామంలో దళితుల కోసం తహశీల్దారే రెండు నెలల క్రితం కేటాయించిన స్థలం చుట్టూ వేసుకున్న ఇనుప కంచెను పీకి, అందులో పాతుకున్న అంబేద్కర్ చిత్రపటంతో కూడిన పోల్‌కు సిమెంట్ అంటించి అవమానపరిచిన రామేశ్వర రెడ్డి కుటుంబంపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గోనెగండ్ల ప్రభుత్వాస్పత్రి వద్ద బి.అగ్రహారం దళిత కుటుంబాలతో కలిసి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.ఆనంద్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు బి.కరుణాకర్‌లు ఎస్‌ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సచ్చేదాకా అవమానాలు పడుతూ బతికే దళితులు, సచ్చిన తర్వాత కూడా పూడ్చేందుకు ఆరడుగుల స్థలం లేక నిరంతర అవమానాలు పడుతూనే ఉన్నారని తెలిపారు. మండలంలోని బి.అగ్రహారం గ్రామంలో శ్మశాన స్థలం లేని దళితులు గత రెండు నెలల క్రితం దళితుడైన రాజశేఖర్ చనిపోయిన సందర్భంగా శ్మశానం కోసం పోరాడి తహశీల్దార్ చేతనే 44 సెంట్ల భూమిని శ్మశాన వాటిక కోసం కేటాయింపు చేయించుకున్నారన్నారు. శ్మశానం పక్కనే 30 ఎకరాల భూమి ఉన్న రామేశ్వర రెడ్డి, అది చాలక దళితులకు కేటాయించిన శ్మశాన భూమిని సైతం కబ్జా చేశారని తెలిపారు. దళితులంతా రూపాయి, రూపాయి పోగేసుకుని శ్మశానం చుట్టూ నిర్మించుకున్న ఇనుప కంచెను సంపూర్ణంగా తీసేసి, శ్మశానంలో పూడ్చుకున్న అంబేద్కర్ చిత్రపటంతో కూడిన బోర్డుకు బురదనటించిన రామేశ్వర్ రెడ్డి, లక్ష్మీదేవి, మారుతీ రెడ్డిపై అట్రాసిటీ కేసును నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తన పొలానికి పోతూ ఘటనను గమనించిన మాలముని, అక్కడికి వచ్చిన గోపాల్, వెంకట రాముడులు ఎందుకు ఇలా చేశారని అడిగినందుకు కులం పేరుతో దూషించి దౌర్జన్యం చేశారన్నారు. దళితులకు సంబంధించిన శ్మశానం తమ చుట్టూ ఉండకూడదనే కుల దురహంకారంతో, అందులో పాతిన అంబేద్కర్ చిత్రపటానికే సిమెంటు పూసి అవమానించే ధైర్యం ఎక్కడి నుంచి వచ్చిందని మండిపడ్డారు. కేటాయించిన స్థలానికి సంపూర్ణమైన హక్కు కల్పించకుండా నిందితులకు తహశీల్దార్ సహకరిస్తున్నట్లు అర్థమవుతోందన్నారు. నిన్న రాత్రి 10 గంటల వరకు ఉన్న కంచె, పొద్దు పొడిచే నాటికి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. అంబేద్కర్‌ను అవమానించి, అంబేద్కర్ బోర్డును తీసి వేస్తూ తిరిగి బోర్డు ఎలా పాతుతారని నిలదీశారు. ఘటనకు కారణమైన రామేశ్వర్ రెడ్డి, లక్ష్మీదేవిని, అందుకు సహకరించిన గిరీశ్వర్ రెడ్డి, మారుతి రెడ్డి, రాఘవేందర్ రెడ్డిపై అట్రాసిటీ కేసును నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. లేకపోతే చలో అగ్రహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం అగ్రహారం గ్రామ దళితులతో కలిసి గోనెగండ్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అగ్రహారం దళితులు బజారి, గిరిరాజు, వంశీకృష్ణ, దస్తగిరి, ఓబులేసు, మునిస్వామి మరో 20 మంది పాల్గొన్నారు.



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న కెవిపిఎస్ నాయకులు


లోకేష్ యాత్రలో ఉమాపతి నాయుడు

యువగళం యాత్రలో ఆదోని నేతలు

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో ఆదోని నేతలు ఉమాపతి నాయుడు, రంగస్వామి నాయుడు పాల్గొంటున్నారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలో లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర గురువారం 96వ రోజుకు చేరింది. యువగళం పాదయాత్రలో పాల్గొన్న ఉమాపతి నాయుడు, రంగస్వామి నాయుడు మాట్లాడారు. పాదయాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వెల్లడవుతోందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ముగింపు వరకు లోకేష్ వెంట నడుస్తామని తెలిపారు.

నేడు ఉచిత నాటక ప్రదర్శన

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ 91వ వెండి రథోత్సవం సందర్భంగా శుక్రవారం రిక్రియేషన్ క్లబ్‌లో రంగస్థల కళాకారులు ఉచిత నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం నాటకాన్ని తిలకించేందుకు పట్టణ ప్రముఖులతోపాటు కెఎన్‌ఆర్ ఛారిటబుల్ ఛైర్మన్ నటరాజ్ స్వామిని ఆహ్వానించారు. నటరాజ్ స్వామి సానుకూలంగా స్పందిస్తూ నైతిక విలువలు తగ్గిపోతున్న తరుణంలో పౌరాణిక నాటకాలు, సాంఘిక నాటకాల ప్రదర్శన ఎంతో అవసరమన్నారు. ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కళాకారులకు ప్రభుత్వ సహకారంతోపాటు కళాపోషకుల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు. నాటక ఆర్గనైజర్స్, లలిత కళా సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ జి.నల్లారెడ్డి, ఉపాధ్యక్షులు కె.తాయన్న, సీనియర్ న్యాయవాది, కళాకారులు చిగురు లక్ష్మణ యాదవ్, మహానంద రెడ్డి పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో నరవ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ఆదోనిలో జరిగిన వివాహ వేడుకలకు టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి హాజరయ్యారు. గురువారం మండలంలోని కల్లుకుంట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త వీరేష్ వివాహానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. టిడిపి నాయకులు నరసన్న పాల్గొన్నారు.

జాతర సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

శ్రీమహాయోగి లక్ష్మమ్మ అవ్వ జాతర సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఉంటుందని మహర్షి విజయకుమార్ స్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. దాతల సహకారంతో మహర్షి విజయకుమార్ స్వామి కుటుంబం, అల్కూరు మఠం ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సంతపేటలోని మహర్షి స్కూల్ ముందు, అవ్వ దేవస్థానానికి అతి దగ్గరలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించే కళాశాలలపై చర్యలు తీసుకోవాలి : డిఎస్‌ఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ అనుమతి లేకున్నా అడ్మిషన్లు నిర్వహించే ప్రయివేట్ డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ధణాపురం ఉదయ్ డిమాండ్ చేశారు. గురువారం ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆర్‌జెడి ప్రతాప్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. కనీస వసతుల్లేని డిగ్రీ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని కోరారు. 2017లో డిగ్రీ పూర్తి చేసి సబ్జెక్టులు మిగిలిన విద్యార్థులకు కూడా సప్లిమెంటరీ ఎగ్జామ్ నిర్వహించాలన్నారు. విచారణ జరిపి అలాంటి కళాశాలపై చర్యలు తీసుకుంటామని ఆర్‌జెడి హామీ ఇచ్చారు. నాయకులు వినోద్, విక్రమ్, హరి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఐపిఎల్ బెట్టింగ్ జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ గ్రామంలో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి దగ్గర నుంచి ఆరు మొబైల్స్, రూ.33,450లను సీజ్ చేసినట్లు ఎస్ఐ భూపాలుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐపిఎల్ బెట్టింగ్ జూదరులపై గత కొన్ని రోజుల నుంచి నిఘా ఉంచామని తెలిపారు. బెట్టింగ్ ఆడుతున్న గ్రామానికి చెందిన రఫీ, రసూల్, కటిక నరేష్, యశ్వంత్, రాజేష్, షబ్బీర్‌ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించే వారిని ఉపేక్షించేది లేదన్నారు.


పోలీసుల అదుపులో బెట్టింగ్ జూదరులు

వేసవి దుక్కులతో అధిక లాభాలు

- చీడ పురుగులు, కలుపు నివారణ, పంట వ్యర్థాలు సద్వినియోగం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

'దున్నకుండా సాగు చేస్తే.. కొయ్యకుండా పోతుంది!' అనేది తెలుగు నానుడి. ఏ పంట వేయాలన్నా ముందుగా దుక్కి దున్నాల్సిందే. విత్తేందుకు, నాటేందుకు అనుకూలంగా పొలాన్ని సిద్ధం చేసుకోవాల్సిందే.! దుక్కి చేయకుండా వదిలేయడం వల్ల భూమి సత్తువ కోల్పోతుంది. చీడపీడలకు ఆవాసంగా మారుతుంది. ముడి పోషకాల లోపం ఏర్పడి, తర్వాత పంటకు భారీగా ఎరువులు వేయాల్సి వస్తుంది. అందుకే రైతులు వేసవిలో లోతు దుక్కుల మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుతం పంట భూములన్నీ ఖాళీగా ఉన్నాయి. భూసారం పెరిగేలా చర్యలు చేపట్టేందుకు ఇదే సరైన సమయం. వేసవి దుక్కులు, భూసార పరీక్షలు చేయించుకొని, వర్షాకాలం పంటకు సిద్ధంగా ఉండాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. దీనివల్ల వచ్చే పంటలో తెగుళ్లు, కలుపు నివారణకు ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. వేసవి దుక్కులతో రైతులకు దక్కే లాభాలను వివరిస్తున్నారు. పంట కోతల తర్వాత చాలామంది రైతులు భూమిని అలాగే వదిలేస్తారు. దీనివల్ల ఖాళీ భూముల్లో కలుపు మొక్కలు, ఇతర గడ్డి జాతి మొక్కలు పెరుగుతాయి. ఇవి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహిస్తాయి. భూమికి సత్తువ లేకుండా చేసి, భూసారాన్ని తగ్గిస్తాయి. భూమి లోపలి పొరల్లోని నీరు ఆవిరైపోతుంది. వేసవి దుక్కులు లేకుంటే తొలకరి వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా పోతుంది. వర్షాల వల్ల భూమి కోతకు గురవుతుంది. ఖాళీ భూముల్లో చీడపీడలు భారీగా వృద్ధి చెందుతాయి. ఫలితంగా రాబోయే పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

లోతుగా దుక్కలు దున్నితే

ఆయా నష్టాలను అధిగమించేందుకు వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవాలి. తద్వారా భూమి లోపల కోశస్త దశలో ఉన్న హానికర పురుగులు, శిలీంధ్రాలు నశిస్తాయి. వర్షపు నీరు భూమిలోకి ఎక్కువగా ఇంకుతుంది. భూమి పొరల్లో తేమ పెరుగుతుంది. తర్వాత వేసే పంట వేరు వ్యవస్థ నేల లోపలి పొరల్లోకి చొచ్చుకెళ్తుంది. తద్వారా పైరుకు రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. వర్షాలకు ముందే భూమిని దున్నడం వల్ల తొలకరి వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుంది. భూమి కోతను నివారిస్తుంది. లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా తయారవుతుంది. భూమిలో తేమశాతం పెరిగి, భూసారం అభివృద్ధి చెందుతుంది. వేసవి దుక్కులకు ముందు పొలంలో పశువుల పెంట, కంపోస్టు ఎరువులు, చెరువులు/కుంటల్లోని మట్టిని వెదజల్లడం ద్వారా భూసారం మరింత పెరుగుతుంది. రాబోయే పంటల్లో అధిక దిగుబడులకు అవకాశం ఇస్తుంది.

నేల గుల్లబారుతుంది

వేసవి వచ్చినప్పుడు, ఆ తర్వాత తొలకరి వర్షాలకు దున్నినప్పుడు నేల గుల్లబారుతుంది. మొక్కల వేర్లు బాగా విస్తరిస్తాయి. సూక్ష్మజీవులు వృద్ధి చెందడంతోపాటు వానపాముల సంతతి గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

పంట అవశేషాల సద్వినియోగం

లోతు దుక్కి దున్నినప్పుడు పంట అవశేషాలు, కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకులు నేలలో కలిసి సేంద్రీయ ఎరువుగా మారుతాయి. నేలలో సేంద్రీయ కర్బన శాతం, పోషక పదార్థాలు పెరిగే అవకాశం ఉంటుంది.

విత్తనాలు, ఎరువుల కొనుగోలులో జాగ్రత్త

ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభం కానుండడంతో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, ఇతరత్రా వ్యవసాయ ఇన్‌పుట్స్ కొనుగోలు చేసే రైతులు కొన్ని జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. అనుమతి లేని కంపెనీలకు చెందిన రకరకాల విత్తనాలు, ఎరువులు, మందులు ఈ సమయంలో మార్కెట్‌లోకి వచ్చే ప్రమాదం ఉన్నందున ఒకటికి రెండుసార్లు ఆలోచించి అన్ని వివరాలూ పరిశీలించి కొనుగోలు చేయాలని తెలుపుతున్నారు. ఏదైనా అనుమానం వస్తే సమీపంలోని వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందజేయాలని సూచిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పొలాలను చదును చేసి సేంద్రీయ ఎరువులు చల్లుకోవాలి. తొలకరికి ముందే లోతు దుక్కులు దున్నుకొని, పొలాలను సాగుకు సిద్ధం చేసుకోవాలి. వర్షాధార మెట్ట వ్యవసాయంలో వాతావరణ అవరోధాలు, భూసారం, కలుపు సమస్యలు, సంప్రదాయ పద్ధతులు లాంటి అవరోధాలు దిగుబడిని దెబ్బతీస్తాయి. రైతులు ఎప్పటికప్పుడు సరికొత్త మెళకువలు పాటిస్తేనే అధిక దిగుబడులు పొందవచ్చు. వేసవి లోతు దుక్కుల వల్ల ఇలాంటి అవరోధాలను అధిగమించవచ్చు. లోతు దుక్కుల వల్ల నేలలో నీరు ఇంకని పొరలు తొలగిపోతాయి. కురిసిన వర్షపు నీరు అక్కడికక్కడే నేలలోకి ఇంకిపోతుంది. వేసవిలో పగలు వేడి, రాత్రి చల్లదనానికి నేల గుల్లగా తయారవుతుంది. తర్వాతి పంటకాలంలో మొక్కల వేర్లు నేలలోపలి పొరలకు వెళ్లేలా సహకరిస్తుంది. పంటకు హాని కలిగించే పురుగులు, కలుపు మొక్కల విత్తనాలు కూడా నశించిపోతాయి. తొలకరి మొదలైన వెంటనే మరో పంట వేసుకోవడం సులభం అవుతుంది.


ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)

పేదలకు అండగా వైఎస్ఆర్ బీమా...

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వైఎస్ఆర్ బీమా పథకం పేదలకు అండగా నిలుస్తోందని ఆదోని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఆరెకల్ గ్రామానికి చెందిన యోహాను ఈఏడాది జనవరిలో బాణసంచా పేలుస్తూ మృతి చెందారు. గురువారం వైఎస్ఆర్ బీమా కింద రూ.5 లక్షలను మృతుని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబానికి అండగా నిలిచేలా వైఎస్ఆర్ బీమా పథకం అమలు చేస్తున్నారన్నారు. ఎంపిడిఒ గీతావాణి, సర్పంచి లోహిత స్వామి, వైసిపి సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, ప్రకాష్, రాముడు, సచివాలయ సిబ్బంది హనుమేష్ పాల్గొన్నారు.


బీమా డబ్బులు అందిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

నిధుల మంజూరు తర్వాత చేపట్టాల్సిన


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆదిశేష నాయుడు

పనులపై ఎమ్మెల్యే ఆరా

ప్రజాశక్తి - మంత్రాలయం

తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి నిధుల తర్వాత దేవాలయాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై దేవదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆది శేష నాయుడును ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అడిగి తెలుసుకున్నారు. గురువారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన ఎమ్మెల్యేకు శాలువా, పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు. టిటిడి తరపున నియోజకవర్గంలోని 31 దేవాలయాలకు నిధులు మంజూరు కాగా, ఆ తర్వాత చేపట్టాల్సిన పనులను అసిస్టెంట్ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. అన్ని రంగాల్లో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన మంత్రాలయం నియోజకవర్గంలోని దేవాల యాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరారు. వైసిపి కోసిగి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

మసీదు నిర్మాణానికి భూమి పూజ

మండలంలోని తుంగభద్ర గ్రామంలో మసీదు నిర్మాణానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి భూమిపూజ చేశారు. గతంలో ఉన్న మసీదు పాత పడడం వల్ల నూతన మసీదు నిర్మాణానికి మతపెద్దల సమక్షంలో నిర్మాణం కోసం ప్రణాళిక చేశారు. మత పెద్దలు ముస్లింల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథి ఎమ్మెల్యేకు, వైసిపి కోసిగి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డికి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే : నూతన వధూవరులకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆశీస్సులు అందజేశారు. మండలంలోని తుంగభద్ర గ్రామంలో జరిగిన వివాహ వేడుకల్లోను, ఎమ్మిగనూరు మండలం హనుమాపురం వద్ద ఉన్న విశాల గార్డెన్‌లో జరిగిన పెళ్లి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కల్యాణ మండపం వద్ద ఆయనకు ఘనంగా స్వాగతం సన్మానించారు. వైసిపి మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, కోసిగి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డి, నాయకులు కాంతా రెడ్డి, ఉన్నారు.

నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్

ఎమ్మిగనూరు రూరల్ : 2023-24 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సాగరిక తెలిపారు. గురువారం ఆమె మాట్లాడారు. దరఖాస్తుల దాఖలు కోసం ఆన్‌లైన్ పోర్టల్ ఈనెల 11 నుంచి ప్రారంభమైందని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తును NVS వెబ్ సైట్ https://navodaya.gov.in ద్వారా అప్లయి చేసుకోవాలని తెలిపారు. **దరఖాస్తు విధానం :** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులు 10వ తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. అభ్యర్థులు ఉమ్మడి కర్నూలు జిల్లా వారై ఉండాలని తెలిపారు. జూన్ 1, 2006 నుంచి జులై 31, 2008 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. **దరఖాస్తుకు చివరి తేదీ:** 31-05-2023, **ఎంపిక పరీక్ష తేదీ :** 22-07-2023(శనివారం), **వెబ్‌సైట్** https://cbseitms.nic.in/2023/jnvxi/registrationclassXI/registrationclassXI

ప్రజాశక్తి
శుక్రవారం 12 మే 2023
5
నంద్యాల





మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న

'ఆమె' సేవలు అమోఘం..

- గుర్తింపునకు దూరం.. వెట్టి చాకిరి..
- స్టాఫ్ నర్సుల సమస్యలు వర్ణనాతీతం
- మెడికల్ ఆఫీసర్ల దయాదాక్షిణ్యాలపైనే సెలవులు
- నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'ఆమె సేవలు అమోఘం.. కానీ ఆ సేవలకు తగిన గుర్తింపు లభించడం లేదు. ఆసుపత్రిలో, పిహెచ్‌సిలో, సిహెచ్‌సిలో ఇలా ప్రతిచోటా ఆమె పాత్ర కీలకం.. ఆసుపత్రుల్లో డాక్టర్ లేకపోయినా వారే వైద్య సేవలు అందిస్తుంటారు. సేవల్లో అమ్మలాగా.. ఉంటూ ఆరోగ్య సేవలు అందిస్తుంటారు.. వారే నర్సులు'. నేడు నర్సు లేకపోతే వైద్య సేవలు ముందుకు సాగని పరిస్థితి ఉంది.. నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...

ఫ్లోరెన్స్ నైటింగేల్ చేసిన అద్భుత సేవలకు గుర్తింపుగా మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. మే 12, 1820న జన్మించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ బ్రిటీష్ నర్సు, సంఘ సంస్కర్త. ఆమెను "ది లేడీ విత్ ది ల్యాంప్"గా గౌరవించారు. 1850లలో క్రిమియన్ యుద్ధం సమయంలో ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సుగా ఎనలేని సేవలు అందించారు. గాయపడిన బ్రిటీష్ సైనికులను చూసుకునే నర్సుల బృందానికి ఆమె బాధ్యత వహించే ఆసుపత్రిలో పని చేశారు. 1860లో లండన్‌లోని నైటింగేల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌కు పునాది వేశారు. రోగులే తమ పిల్లలుగా భావిస్తూ నర్సులు అహోరాత్రులు శ్రమిస్తారు. అటు డాక్టర్లకు, ఇటు రోగులకు



వాళ్లు నిత్యం అందుబాటులో ఉండాల్సిందే. కానీ వాళ్ల పనిని ఎవరూ గుర్తించరు. ఎన్నో ఏళ్లుగా వీరు వెట్టి చాకిరీకి గురౌతున్నారు. పిహెచ్‌సి, సిహెచ్‌సిలలో 24/7 పేరుతో వీరికి సెలవులు, వీక్లీ ఆఫ్ అనేది కూడా లేకుండా వీరితో పని చేయించు కుంటున్నారు. ఆసుపత్రులలో వైద్యులు లేకపోయినా వీరే దగ్గరుండి రోగులకు స్టాఫ్ నర్సులు సేవలు అందిస్తున్నారు. ప్రసవాలు చేసేటప్పుడు పక్కన వైద్యులు లేక పోయినా ఎంతో రిస్క్ చేసి కాన్పులు చేస్తుంటారు. అనేక ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్దతిన విధులు నిర్వహిస్తున్న వీరిని ఇంత వరకు ప్రభుత్వాలు రెగ్యులర్ చేయడం లేదు. విధులు చేసే చోట వీరికి రక్షణ లేదు. వేధింపులకు గురౌతున్నారు. వైద్యులకు, పారామెడికల్ సిబ్బందికి ప్రభుత్వ సెలవులు వర్తిస్తాయి. కానీ స్టాఫ్ నర్సులకు మాత్రం వర్తించకపోవడం బాధాకరం. పిహెచ్‌సి, సిహెచ్‌సిలలో ఆదివారం కూడా విధులు నిర్వహించాల్సిందే. ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండే పిహెచ్‌సిలలోనైతే ఓ స్టాఫ్ నర్సు సెలవు తీసుకుంటే ఉన్న ఇద్దరు నర్సులు 12 గంటలు విధుల్లో ఉండాల్సిందే. ఇదేమిటని అడిగిన నర్సులను వేధిస్తున్న సంఘటనలు జిల్లాలో అనేకం. విధులు నిర్వహించే చోట నర్సులకు సరైన సౌకర్యాలు ఉండటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులను తక్షణమే రెగ్యులర్ చేయాలని నర్సులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

స్టాఫ్ నర్సులకు ఉద్యోగ భద్రత కల్పించాలి
కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి



రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఏళ్ల నుండి పని చేస్తున్న స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి. వెట్టి చాకిరీ నుండి విముక్తి కల్పించాలి. స్టాఫ్ నర్సులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. పిహెచ్‌సిలలో నైట్ వాచ్‌మెన్ ఏర్పాటు చేయాలి. స్వీపర్ పోస్టులు ఖాళీ ఉండటంతో స్టాఫ్ నర్సులతోనే పని చేయిస్తున్నారు. స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో, కాలేజీ ఆఫ్ నర్సింగ్‌లో సీనియర్టీ ప్రకారం బోధనకు స్టాఫ్ నర్సులను వినియోగించుకోవాలి. కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి.

డి. మంజులా దేవి, రాష్ట్ర అధ్యక్షురాలు,
ఏపి ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్.

బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి

- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న

ప్రజాశక్తి - నంద్యాల

రెజ్లర్ క్రీడాకారులపై లైంగిక దాడికి పాల్పడిన బిజెపి ఎంపీని పార్లమెంటు నుంచి తొలగించి అరెస్టు చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న డిమాండ్ కేంద్ర ప్రభుత్వాన్ని చేశారు. గురువారం స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా విస్తరించేలా రెజ్లర్ల మహిళా క్రీడాకారులు పతకాలను సాధిస్తుంటే అండగా నిలవాల్సిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కంచె చేను మేసినట్లు వారిపై లైంగిక వేధింపులకు పాల్పడడం దారుణమన్నారు. వారి సమస్యలను ఎవరు పరిష్కరించాలని ప్రశ్నించారు. క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారి పైన చర్య తీసుకోవాలని జనవరిలో ఆందోళనకు దిగితే ప్రభుత్వం కమిటీ వేసి విచారిస్తామని హామీనిచ్చి నాలుగు నెలలైనా పట్టించుకోక పోవడంతో కొద్ది రోజుల కిందట ఏడు మంది మహిళా రెజ్లర్ల క్రీడాకారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారని తెలిపారు. కోర్టు సైతం ఇది తీవ్రమైన ఆరోపణ, తక్షణమే ఢిల్లీ పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించినా బిజెపి ఎంపీని కాపాడడం కోసం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. లైంగిక వేధింపులకు గురైన క్రీడాకారిణులపై, వారి కుటుంబ సభ్యులపై దౌర్జన్యాలకు, బెదిరింపులకు పాల్పడడం, ఆర్థికంగా సహకరిస్తామని ఆశ పెడుతున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా మేధావులు, ప్రజాసంఘాలు, మహిళ రైతు సంఘాలు, జమ్మూ కాశ్మీర్ మాజీ గవర్నర్ మాలిక్ లాంటి మేధావులు మద్దతుగా నిలుస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. తక్షణమే మోడీ ప్రభుత్వం రెజ్లర్ల ఆందోళనకు స్పందించి బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ నాయకులు వినీత్, సంజయ్, మధు, నాగూర్, తదితరులు పాల్గొన్నారు.

పది ఫెయిల్ విద్యార్థులకు రెమిడియల్ తరగతులు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్



మాట్లాడుతున్న దృశ్యం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రెమిడియల్ తరగతులు ప్రారంభించి జూలైలో నిర్వహించనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా విద్యా బోధన జరపాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో రెమిడియల్ తరగతులు, నాడు-నేడు ప్రగతి పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రెమిడియల్ తరగతులు ప్రారంభించి, ప్రతి రోజు మూడు సబ్జెక్టులను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు ఎంఇఒలు, హెచ్‌ఎంలు పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పెద్ద, చిన్న మరమ్మతుల పనులు జూన్ 10లోగా పూర్తిస్థాయిలో ఏర్పాటై విద్యార్థులకు అందు బాటులోకి తీసుకురావా లన్నారు. పాఠశాల ప్రారంభం రోజు నుండే జగనన్న విద్యా కిట్లను ప్రతి విద్యార్థికి బయోమెట్రిక్ హాజరుతో సమానంగా పంపిణీ చేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత అడ్మిషన్ల భర్తీ నిమిత్తం విస్తృత ప్రచారం కల్పించి తల్లిదండ్రుల్లో అవగాహన తీసుకురావా లన్నారు. బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. 1 నుంచి ఐదో తరగతి కోసం అడ్మిషన్లు తీసుకునేటప్పుడు వారి ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్ తీసుకోవాలని, వయోపరిమితి ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ సెక్టోరల్ అధికారి లలిత, ఇంచార్జ్ డిఇఒ బేగ్, డోన్ డిప్యూటీ డిఇఒ క్రిష్టఫర్, డివిఈఒ సుజాత, లైజన్ ఆఫీసర్ దానం, సమగ్ర శిక్షా ఈఈ ఈశ్వరయ్య, మున్సిపల్ ఈఈ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెంచాలి : ఎపిడబ్ల్యూజెఎఫ్



డిపిఆర్‌ఒకు వినతిపత్రం అందచేస్తున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డు కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలని ఎపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ప్రతినిధి బృందం ఐఅండ్‌పిఆర్ ఇంచార్జ్ డిడి మల్లికార్జునకు వినతిపత్రం సమర్పించారు. గడువు పొడిగింపుపై జిల్లా అక్రిడిటేషన్ చైర్మన్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, ఈ నెల 15 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించేలా కృషి చేస్తామని ఇన్‌ఛార్జి డిడి హామీ ఇచ్చారు. కార్యమకంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ డి.మౌలాలి, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు మాదాల శ్రీనివాసులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శివ, జగన్ మోహన్, జిల్లా నాయకులు నాగవర్ధన్ రెడ్డి, పట్టణ సహాయ కార్యదర్శులు మల్లికార్జున, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

- దారిపొడవున ఆత్మీయ స్వాగతం
- నందికొట్కూరు నియోజకవర్గంలో యువగళం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/నందికొట్కూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 96వ రోజు నందికొట్కూరు నియోజకవర్గంలో ఉత్సాహంగా సాగింది. దారిపొడవునా వివిధ గ్రామాల ప్రజలు లోకేష్‌కు స్వాగతం పలికి తాము ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. నందికొట్కూరు శివారు క్యాంప్ సైట్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర తార్టూరు, మండ్లెం, తంగడంచ, జూపాడు బంగ్లా, తాటిపాడు, తరిగొప్పుల క్రాస్ మీదుగా బన్నూరు చేరుకుంది. మండ్లెం గ్రామంలో సాగునీటి కోసం జలదీక్ష చేస్తున్న గ్రామ రైతులకు యువనేత నారా లోకేష్ సంఘీభావం తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మండ్లెం ప్రాంతంలో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి, సాగునీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మధ్యాహ్నం తంగడంచ వద్ద భోజన విరామ సమయంలో బిసిలతో సమావేశమై వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. తంగడంచ వద్ద గత ప్రభుత్వ హయాంలో భూములు కేటాయించిన జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టు వద్ద సెల్ఫీ దిగిన లోకేష్... వేలాది మందికి ఉపాధి కల్పించే ఆ ప్రాజెక్టు జగన్ రెడ్డి ప్రభుత్వ ప్రోత్సాహం లేక వెళ్లిపోయిందని చెప్పారు. పాదయాత్ర దారిలో యాదవులు, రైతులు, బిసిలు యువనేతను కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు.

విధ్వంసక పాలనకు సజీవసాక్షి జైన్ ఇరిగేషన్

తంగెడంచ వద్ద నిలిచిపోయిన జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టు వద్ద సెల్ఫీ దిగిన లోకేష్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. విధ్వంసక పాలకుడు, జగన్ వినాశక చర్యలకు ప్రత్యక్షసాక్షి నందికొట్కూరు నియోజకవర్గం తంగెడంచలో నిలచిపోయిన జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టు అని తెలిపారు. రైతులకు అధునాతన వ్యవసాయ పరికరాలు అందించడంతోపాటు కరువు సీమలో యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో చంద్రబాబు గారి ఆహ్వానం మేరకు అప్పట్లో స్వర్గీయ భవర్ లాల్ జైన్ తంగెడంచలో ప్రాజెక్టు ఏర్పాటుకు ముందుకు వచ్చారన్నారు. గత ప్రభుత్వంలో ఇందుకోసం 623 ఎకరాల భూమి కూడా కేటాయించారని, అనుకున్న ప్రకారం ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్ర రైతాంగం జీవన స్థితిగతులు మారిపోయేవని పేర్కొన్నారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సహకారం లేకపోవడంతో జైన్ ప్రాజెక్టు నిలచిపోయిందన్నారు. పాదయాత్రలో మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, భూమా అఖిల ప్రియ, టిడిపి జిల్లా ఇంచార్జి గౌరు వెంకటరెడ్డి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పార్వతమ్మ, నియోజకవర్గ ఇంచార్జి మాండ్ర శివానంద రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారా లోకేష్



వినతులు స్వీకరిస్తున్న నారా లోకేష్



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న మక్బూల్ హుస్సేన్

దారుల్ హుదా విశ్వవిద్యాలయ గోడపత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని అరుణోదయ పాఠశాలలో దారుల్ హుదా ఇస్లామిక్ విశ్వవిద్యాలయం కేరళ వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని పుంగనూరులో నిర్వహిస్తున్న ఇస్లామిక్ విశ్వవిద్యాలయంకు సంబంధించిన గోడపత్రికలను గురువారం విడుదల చేశారు. పుంగనూరు ఇస్లామిక్ విశ్వవిద్యాలయం ప్రోగ్రాం మేనేజర్ మక్బూల్ హుస్సేన్ మాట్లాడుతూ దారుల్ హుదా పుంగనూరు విశ్వవిద్యాలయంలో భౌతిక విద్యతోపాటు ధార్మిక విద్యను కూడా అందిస్తున్న ఏకైక విద్యాసంస్థ అన్నారు. ఈ నెల 13న నంద్యాల పట్టణంలోని అల్ఫురాన్ మస్జిద్‌లో ఐదవ తరగతి పూర్తి చేసుకుని ఆరవ తరగతికి వెళ్లే విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఖాజీ, జామియా మసీదు ఇమామ్ జాఫర్ సాదిక్ మాట్లాడుతూ నేటి యువతకు ఆధునిక విద్యతోపాటు ఆధ్యాత్మిక విద్య కూడా ఎంతో అవసరమని చెప్పారు. ఇలాంటి అవకాశాన్ని పూర్తిగా ఉచితంగా అందిస్తున్న దారుల్ హుదా ఇస్లామిక్ విశ్వవిద్యాలయం వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ఇలాంటి ఇస్లామిక్ విశ్వవిద్యాలయంలో చేర్చేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ కమిటీ నాయకుడు బీరువాల భాష, కమిటీ సభ్యుడు హాఫీస్ మసీవుల్లా పాల్గొన్నారు.

బాధితులకు నిత్యవసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఇటీవల నంద్యాలలో పొన్నాపురం కాలనీలో గ్యాస్ సిలిండర్ పేలి ఇండ్లు ధ్వంసమై సర్వం కోల్పోయిన బాధితులు మహబూబ్ బాషా, సాయిబాబా నగర్‌లో రమాదేవి, గంగాధర్‌లకు రెడ్ క్రాస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ద్వారా వచ్చిన ఇంటి వంట సామాగ్రి, దాతల ద్వారా సేకరించిన నిత్యవసర వస్తువులు రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల ఎమ్మెల్యే శిల్పా చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్య తెలియపరచిన వెంటనే స్పందించిన రెడ్ క్రాస్ సొసైటీ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ భాష, యాకోబు, మండల సబ్ బ్రాంచ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ సోహెల్, రెడ్ క్రాస్ లైఫ్ మెంబర్స్ రమేష్, బాలుడు, డిఎఫ్ఒ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : బిసి రాజారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందని పట్టణ మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి తెలిపారు. గురువారం పట్టణానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులకు రూ.10 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను ఉచితంగా ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ స్నేహభావంతో ఉండాలన్నారు. ఓటమి చెందితే కుంగిపోకుండా రెట్టింపు ఉత్సాహంతో మరోసారి పోటీల్లో పాల్గొని విజయం సాధించాలన్నారు. ఓటమి అనేది గెలుపునకు నాందిగా స్వీకరించాలన్నారు. యువత జీవితాల్లో క్రీడలు ఒక భాగం కావాలన్నారు. క్రీడల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోని చిన్న చిన్న దేశాల క్రీడాకారులు ఒలంపిక్స్‌లో ఎన్నో బంగారు పతకాలు సాధిస్తున్నారని, అయితే భారతదేశం క్రీడల్లో చాలా వెనుకబడి ఉందన్నారు. ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేకే క్రీడాకారులు ఆయా క్రీడల్లో రాణించలేక వెనుకబడిపోతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులను ప్రోత్సహించి వారికి తగిన గుర్తింపును ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతిరోజు యోగా, వ్యాయామం అలవాటు చేసుకోవడం ఎంతైనా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో నుసి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి

'కేరళ స్టోరీ' రద్దు చేయాలని

13న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - నంద్యాల

కేరళ స్టోరీ సినిమా రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 13న ప్రజాస్వామ్య లౌకిక ఐక్యవేదిక, నంద్యాల ఆధ్వర్యంలో స్థానిక ఆవాజ్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రజాస్వామ్య లౌకిక ఐక్యవేదిక కన్వీనర్ ఎస్‌ఎండి అబులైస్ తెలిపారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి మేధావులు, ప్రజాసంఘాలు లౌకిక, ప్రజాస్వామ్య వాదులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జమతే ఇస్లామి అధ్యక్షులు ఎస్.అబ్దుల్ సమద్, ఆవాజ్ జిల్లా ప్రెసిడెంట్ ఎస్.మస్తాన్వలి, నంద్యాల ప్రెసిడెంట్ బాబుల్లా, ఇన్సాఫ్ అధ్యక్షులు బాబా ఫక్రుద్దీన్, హుస్సేన్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ అబులైస్

నాటు సారా స్వాధీనం - వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - అవుకు/బనగానపల్లె రూరల్ : మండలంలోని వేములపాడు గ్రామ సమీపంలో ఉన్న పవర్ ప్లాంట్ వద్ద బైక్‌పై 180 లీటర్ల సారాయిని తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు బనగానపల్లె సెబ్ సిఐ సుభాషిని గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ బనగానపల్లె మండలంలోని రాళ్ల కొత్తూరు గ్రామానికి చెందిన అమర్ నాయక్ బైకుపై నాటు సారా తరలిస్తుండగా పట్టుకుని అరెస్టు చేశామన్నారు. మండలంలోని గడ్డమేకుల పల్లె గ్రామానికి చెందిన సోమన్నకు చెందినది సారా అని చెప్పడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.



నాటు సారా, వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సెబ్ పోలీసులు

రాష్ట్రంలో జేబు దొంగల పాలన

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసి రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో సంక్షేమం పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జేబు దొంగ పాలన సాగిస్తున్నారని, ప్రజల నుండి దోచుకున్న సొమ్మును తిరిగి వారికే ఇస్తున్నారని మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ సర్రెడ్డి తులసి రెడ్డి ఘాటు వాఖ్యలు చేశారు. గురువారం నంద్యాల జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన రైతు నగరంలోని జిల్లా కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు జె.లక్ష్మి నరసింహ యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి బిజెపి ఒక శని గ్రహంలా, వైసిపి, టిడిపిలు రాహు కేతువులుగా దాపురించాయని అన్నారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం, మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రానికి సంజీవిని లాంటి ప్రత్యేక హెూదాకు పంగనామాలు పెట్టిందని, కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్‌కు స్వస్తి పలికిందని, దుగరాజపట్నం ఓడరేవు ఊసే లేదన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీకి తిలోదకాలు ఇచ్చిందని చెప్పారు. కేంద్రమే చేపట్టాల్సిన పోలవరంను ప్రశ్నార్ధకంగా మార్చిందన్నారు. విశాఖ రైల్వే జోన్, విశాఖ, విజయవాడ మెట్రో రైళ్ల ఊసే లేదన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను నరేంద్ర మోడీ ప్రభుత్వం అమ్మకానికి పెడుతోందని, ఆంధ్రా బ్యాంకును కాలగర్భంలో కలిపేసిందని విమర్శించారు. దేశాన్ని అప్పుల భారత్ మార్చిందన్నారు. బిజెపి చేతిలో వైసిపి, టిడిపి, జనసేనలు కీలుబొమ్మలని ఆరోపించారు. బి అంటే బాబు, జె అంటే జగన్, పి అంటే పవన్ అన్నట్లు తయారయ్యాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తప్ప రాష్ట్రం బాగుపడదని స్పష్టం చేశారు. లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 6 సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు చింతలయ్య, మైనారిటీ జిల్లా అధ్యక్షులు పఠాన్ అభిబ్ ఖాన్, మంత్రాలయం ఇంచార్జ్ బాబురావు, ఆళ్లగడ్డ సమన్వయ కర్త గంధం మల్లేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తులసి రెడ్డి



ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకులు శంషుల్ హక్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆసుపత్రి యాజమాన్యాలు ఈనెల 1వ తేదీ నుంచి నిలిపివేశారని, వారికి రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకులు శంషుల్ హక్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ లేకుంటే పేదలు పూర్తిగా ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు అదనంగా 83 వేల రూపాయలు పెంచడం చాలా దారుణమన్నారు. ప్రతి సంవత్సరం దాదాపు లక్ష 25 వేల మంది హజ్ యాత్రకు వెళ్తారని, ముస్లింలపై వైసిపి ప్రభుత్వం భారం వేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం ముస్లింల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ఇదే విధంగా కొనసాగితే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముస్లింలు వైసిపిని చిత్తుగా ఓడిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ మండల అధ్యక్షుడు బరగొడ్ల హుస్సేన్ భాష, వెంకట సుబ్బయ్య యాదవ్, పసుపులేటి లక్ష్మీ నరసింహుడు, శ్రీనివాసులు యాదవ్, వికలాంగుల తాలూకా అధ్యక్షుడు సంజీవ కుమార్ యాదవ్, షరీఫ్, జాఫర్ హుస్సేన్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

15 నుండి విగ్రహ ప్రతిష్ట వేడుకలు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 15, 16, 17వ తేదీలలో విగ్రహ ప్రతిష్ట వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. విగ్రహ ప్రతిష్ట వేడుకల సందర్భంగా సేద్యపు ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు బహుమతులు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5,116, రూ. 5 వేలు నగదు అందజేస్తామన్నారు. అలాగే ట్రాక్టర్ రివర్స్ పందెం, మోటార్ సైకిల్ రౌండ్ పందెం, రాతి గుండు ఎత్తే పందెం నిర్వహిస్తున్నటుట్లు చెప్పారు. చెక్కభజనతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



విగ్రహ ప్రతిష్ట వేడుకలకు ముస్తాబైన ఆలయం

క్రీడా స్ఫూర్తితో మెలగాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

క్రీడల్లో గెలుపు,ఓటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో మెలగాలని ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. పట్టణం లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 4వ ఆంధ్రప్రదేశ్ జూనియర్స్ టెన్నిస్ క్రికెట్ చాంఫియన్ షిప్ పోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ జెండా,నంద్యాల జిల్లా టెన్నిస్ క్రికెట్ అసోషియేషన్ జెండాలను ఆవిష్కరించి క్రీడాకారులచే గౌరవ వందనాన్ని స్వీకరించి పోటీలను ప్రారంబించారు. అనంతరం రాష్ట్ర టెన్నిస్ క్రికెట్ అసోషియేషన్ కార్యదర్శి రేవంత్, సిఈఓ రాజు, నంద్యాల జిల్లా టెన్నిస్ క్రికెట్ అసోషియేషన్ అధ్యక్షుడు షబ్బీర్ (చక్రం బీడి)లు మాట్లాడు తూ ఈ పోటీలలో రాష్ట్రంలోని 15 జిల్లాల జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన జట్లకు ట్రోఫితో పాటు,ప్రసంసా పత్రాలను, మెడల్స్‌ను అందజేస్తామన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన జట్ల నుంచి 16 మంది క్రీడాకారులను ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టును ప్రకటిస్తామన్నారు. ఈ పోటీలకు జాతీయ ఏ గ్రేడ్ విభాగానికి చెందిన జగన్నాధరావు అంపైర్‌గా వ్యవహరిస్తారన్నారు. క్రీడాకారులక బైరవగుండాల ఆలయ నిర్వాహకులు,శ్రీ కాశినాయన శిష్యుడు మునయ్య స్వామీ బోజన వసతి ఏర్పాటు చేసారు. అనంతరం ఎమ్మెల్యేను నిర్వహ కులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బాబులాల్,మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,వైస్ ఎంపిపి రఫి,హెచ్ఎం కోటయ్య,తెలుగుగంగ జేఈ సలీం,విద్యా కమిటీ చైర్మన్ అబ్దుల్లా,నంద్యాల జిల్లా టెన్నిస్ క్రికెట్ అసోషియేషన్ కార్యదర్శి కడ్డీ మహబూబ్ బాషా, దాతలు శ్రీకాంత్,ఇంతియాజ్, శ్రీను, ఇర్షాద్, పిఈటిలు దాదాపీర్, షెక్షావలి, ప్రసాద్, జానీ,జహంగీర్,తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

'ఉపాధి' పరిరక్షణకు ఉద్యమించాలి

- ఎన్‌ఆర్‌ఇజిఎను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర
- అందులో భాగమే ఆన్లైన్‌లో ఫోటో యాప్ మస్టర్ విధానం
- 15న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా
- విజయవంతం చేయాలి : వ్యకాసం

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఉపాధి హామీ పథకం పరిరక్షణకై ఉపాధి కూలీలంతా ఐక్యంగా ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని బొల్లవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వ్యకాస జిల్లా సహా కార్యదర్శి పి పకీరి సాహెబ్, మండల అధ్యక్షులు సంపంగి వెంకటేశ్వర్లు కలిసి పరిశీలించి, కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పడుతోందని, ఆ మేరకు కేంద్ర బడ్జెట్లో 30 శాతం కోత విధించిందన్నారు. ఉపాధి హామీ కూలీల హాజరు ఆన్లైన్లో తీసుకోవాలని ఫోటో యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఫోటో యాప్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతి విధానాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పనిచేసే చోట టెంట్ సౌకర్యం కల్పించి, మజ్జిగ మెడికల్ కిట్టు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలీలకు ప్లే స్లిప్పులు ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 200 రోజులు పనులు కల్పిస్తూ రూ.600 వేతనం ఇవ్వాలని, తదితర డిమాండ్లపై ఈనెల 15వ తేదీన కలెక్టర్ కార్యాలయం ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది ఉపాధి కూలీలంతా తరలివచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి, కిషోర్, బాల నాగన్న ,చిన్న బాలస్వామి, తలారి రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో అభివాదం తెలుపుతున్న వ్యకాసం నాయకులు

కొత్తపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు ప్రవేశ పెట్టిన ఆన్లైన్‌లో ఫోటో యాప్ మస్టర్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతిని కొనసాగించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, మండల కార్యదర్శి కే రాజేష్ డిమాండ్ చేశారు. గురువారం నాడు వారు మండలంలోని లింగాపురం, శివపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్లైన్ ఫోటో మస్టర్ వల్ల కూలీలు పనులు చేసినప్పటికీ నెట్వర్క్ లేక ఆన్లైన్‌లో మస్టర్ నమోదు చేయడంలో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఈనెల 15వ తేదీన నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలు గ్రామాల్లో ఉన్న ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ప్రేమ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సత్య రాజు, స్వామినాథం, ధర్మరాజు, నాగమ్మ, జయమ్మ, సాలమ్మ, చంద్రశేఖర్, విజయలక్ష్మి, చాకలి లింగమ్మ, నారాయణమ్మ పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

నారా లోకేష్‌కు ఎపి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వినతి

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఉమ్మడి జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎపి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం నందికొట్కూరు నియోజకవర్గంలో కొనసాగుతున్న యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌ను వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నేతలు కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల నాయకులు మాట్లాడుతూ (అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న పస్తుత ప్రభుత్వంలో జర్నలిస్టులకు అక్రిడేషన్ లేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పెరిగిన ధరలకు అద్దె ఇళ్ళలో నివసించడానికి అద్దెలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని, జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్, ప్రైవేట్, స్కూల్స్, కాలేజీలలో 100 శాతం ఫీజులు లేకుండా రాయితీ ఇప్పించడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వివరించారు. జర్నలిస్ట సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి ద్వారా పోరాటం సాగించి తగు న్యాయం చేయాలని నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. నందికొట్కూరు పత్రికా సోదరులు పల్లెవెలుగు జయరాజు, తెలుగు ప్రభ గోపి, ప్రజాశక్తి స్వామన్న, పల్లెవాణి ఉమర్, తదితరులు పాల్గొన్నారు.



నారా లోకేష్‌కు వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రజాశక్తి - బేతంచర్ల

మండలంలో గోర్లగుట్ట గ్రామ నివాసి బీరేలి లక్ష్మీదేవి (30) కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. స్థానిక పోలీసుల సమాచారం మేరకు.. గొర్లగుట్ట గ్రామానికి చెందిన హరిజనవాడకు చెందిన బీరేలి లక్ష్మీదేవికి ఆదే గ్రామానికి చెందిన బీరెల్లి శంకర్‌తో వివాహం అయ్యింది. గత మూడు రోజుల కిందట భర్త శంకర్, లక్ష్మీదేవిల మధ్య గొడవ జరగింది. దీంతో లక్ష్మీదేవి ఇంటి ముందర కల్లాపు చల్లే లిక్విడ్ ద్రావకాన్ని తాగింది. చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక గురువారం ఉదయం మరణించిందని బేతంచర్ల పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఎం.వి రమణ తెలిపారు. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఇచ్చిన సమాచారం మేరకు బేతంచెర్ల పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల అభివృద్ధికి అనేక పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

రైతులకు అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణంలో ఏపీ మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలో ఉన్న సిద్దాపురం లిఫ్ట్ ఇరిగేషన్ వలన 22 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని దీనితో రైతులు పంటలను పుష్కలంగా పండిస్తున్నారు. పండించిన పంటలను గ్రామాలలో రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఉలేమలకు ఇళ్ల పట్టాలు పంపిణీ : ఆత్మకూరు పట్టణంలోని మైనార్టీ కాలనీలో 16 మంది ఉలేమలకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ కాలనీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధుల ద్వారా రోడ్లు డ్రైనేజీలు ఏర్పాటు చేయిస్తానని అన్నారు. షాదిఖానా నిర్మాణం కోసం సొంత నిధులను కూడా కేటాయించి పనులు త్వరితగతిన పూర్తి చేయిస్తానని ఆయన అన్నారు. మదర్‌సాల అభివృద్ధి కోసం రూ.2.24 లక్షల నిధులను కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపా లిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా, ఎంపీపీ నల్లకాల్వ తిరుపాలమ్మ, జెడ్పిటిసి సభ్యుడు శివశంకర్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు సయ్యద్ మీర్, రాజమోహన్ రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కారు బోల్తా

- ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని మద్దూరు మెట్ట సమీపంలో జాతీయ రహదారిపై అదుపు తప్పి కారు బోల్తా పడి ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. అంబులెన్సు, ఆసుపత్రి సిబ్బంది తెలిపిన వివరాలు మేరకు.. న ఘటనలో కడప జిల్లాకు చెందిన సుజాత, అనురాధలు ఏపీ 040 0036 నంబరు గల కారులో కర్నూలులోని బంధువుల వివాహనికి వెళ్లారు. అక్కడ వివాహం పూర్తయ్యాక తిరిగి వస్తుండగా మద్దూరు సమీపానికి చేరుకోగాని ప్రమాదవశాత్తు కారు కల్వర్టులోకి బోల్తాకొట్టింది. కారులోని సుజాత, అనురాధ తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవింగ్లో ఉన్న వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిన మహిళలను టోల్ ప్లాజా అంబులెన్సులో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

వికలాంగులకు వీల్ చైర్లు పంపిణీ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వికలాంగులకు వీల్ చైర్లను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గురువారం పంపిణీ చేశారు. రెండు రోజుల క్రితం బిసి కాలనీకి చెందిన యువకులు వచ్చి తమకు తెలిసిన కుటుంబంలో అంగవైకల్యం, మతిస్థిమితం లేని వికలాంగులు ఉన్నారని, నడవలేని పరిస్థితి ఉందని ఎమ్మెల్యే కుమారుడు కాటసాని ఓబుల్ రెడ్డికి తెలిపారు. వెంటనే ఆయన స్పందించి అతనితోపాటు కొంతమంది వికలాంగులకు నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీల్ చైర్స్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అతని కుమారుడు వైసీపీ యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు ఫైరోజ్, అత్తార్ అఖిల్, కరీం, సికిందర్, అబ్దుల్లా, సయ్యద్, ఆసిఫ్, మాభాష, సలీం, సోయాబ్, తాహిర్ తదితరులు పాల్గొన్నారు.



వీల్ చైర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్ర రెడ్డి

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- ఉపాధి హామీ పనులను పరిశీలించిన ప్రాజెక్టు డైరెక్టర్

ప్రజాశక్తి - బేతంచెర్ల

వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధి హామీ కూలీలకు జాతీయ ఉపాధి హామీ పథకం పనుల ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డి సూచించారు. మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పిడి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పిడి రామచంద్రారెడ్డి కూలీలతో మాట్లాడుతూ వేసవికాలంలో పనిచేస్తున్న ఉపాధి హామీ పథకంలోని ప్రతి కార్మికులు ఎండ దెబ్బ వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కూలీలకు సగటున వేతనం రూ. 272 పడేలా పనులు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వాధికారులు సూచించిన మేరకు ఉదయకాలమే ఉపాధి పనికి వచ్చి 10 గంటల లోపు పనులు ముగించుకుంటే బాగుంటుందని ఆయన కూలీలతో అన్నారు. సాధ్యమైనంత త్వరగా ఉపాధి హామీ పథకంలో ఉన్న ప్రతి కార్మికుడికి పనులు కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు.

మహానందిలో నేడు విగ్రహ ప్రతిష్ట : ఇఒ

ప్రజాశక్తి - మహానంది

మహానంది క్షేత్రంలో శుక్రవారం రాహు ,కేతు విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ట రోజు పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొంటారని చెప్పారు. గురువారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సంబంధించి పూజ కార్యక్రమాలు జరుగుతుండగా వర్షం కురవడం ప్రాధాన్యత సంతరిం చుకున్నట్లు ఆలయ వేద పండితులు రవిశంకర్ అవధాని తెలిపారు.

నేడు పాములపాడుకు యువగళం

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలానికి తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి చేపట్టిన యువగళం పాదయాత్ర శుక్రవారం పాములపాడు మండలంలో కొనసాగనుంది. ఈ మేరకు పాదయాత్రకు టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున స్వాగతం బ్యానర్లు ఏర్పాటు చేశారు.

ఉపాధి పనులను ఎపిడి తనిఖీ

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో ఉపాధి పనులను ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడి అన్వర్ బేగం తనిఖీ చేశారు. కూలీల మస్టర్ పరిశీలించి, కూలీలకు పలు సూచనలు చేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ పొలం ఉన్నవారు హార్టికల్చర్ సాగు చేసుకున్నట్లయితే ప్రభుత్వం రాయితీ ఇస్తుందని సూచనలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ విమలమ్మ, జేఈ రమేష్ నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



కూలీలతో ఎపిడి

ఆర్థిక మంత్రి కృషితో యువతకు ఉపాధి

- నైపుణ్యాభివృద్ధి సాధించిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి-డోన్

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కృషితో యువతకు అత్యాధునిక సాంకేతిక శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డోన్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ సొల్యూషన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్ కోర్సులలో శిక్షణ పూర్తిచేసి అర్హత సాధించిన వారికి గురువారం గౌరవప్రదమైన వీల్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధానంగా అర్హత సాధించిన ప్రతి ఒక్కరికీ డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ సర్టిఫికెట్లను, వాలిడెక్టరీ కిట్లు, ఉద్యోగం పొందడానికి ఆఫర్ లెటర్ అందజేశారు. ఛైర్మన్ రాజేష్ మాట్లాడుతూ డోన్ రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు స్కిల్ హబ్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ శిక్షణలో అత్యాధునిక సాంకేతిక కోర్సులను ఏర్పాటు చేసి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి శిక్షణ , తద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పివి. ప్రతాప్‌రెడ్డి, ఐటిఐ కళశాల ప్రిన్సిపల్ పి.రాయపురెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

స్థానిక మార్కెట్ యార్డులో ఏపి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొక్కజొన్న పంటకు మద్దతు ధర క్వింటాకు రూ.1962 నిర్ణయించిందన్నారు. మొక్కజొన్న రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ధాన్యం అమ్ముకోవాల్సిన రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, మార్కెట్ యార్డ్ కార్యదర్శి నారాయణస్వామి, వైస్ చైర్మన్ నరహరి, ఏడిఏ రామ్మోహన్ రెడ్డి, ఏవో కిషోర్ కుమార్ రెడ్డి, మార్క్ ఫెడ్ అధికారి ప్రవీణ్, టెక్నికల్ అనలిస్టు నాగేంద్ర ప్రసాద్, వైసిపి నాయకులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నందీశ్వరునికి పూజలు

స్థానిక కాచింతల శైవ క్షేత్రంలో నందీశ్వరుని విగ్రహ పున:ప్రతిష్ట మహెూత్సవం గురువారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల నాని పాల్గొని నందీశ్వరునికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేను అర్చకులు సత్కరించి ఆశీర్వాదాలు అందజేశారు.

మార్కెట్‌కు అనుగుణంగా పంటలు పండించాలి

- వ్యవసాయ సాంకేతికత వినియోగ పరిశోధణ సంస్థ డైరెక్టర్

ప్రజాశక్తి - బనగానపల్లె

మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రైతులు పంటలు పండించాలని భారత వ్యవసాయ పరిశోధనా మండలి, వ్యవసాయ సాంకేతికత వినియోగ పరిశోధన సంస్థ డైరెక్టర్ డా. షేక్ ఎన్.మీరా తెలిపారు. గురువారం మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆమె సందర్శించారు. వివిధ ప్రదర్శన యూనిట్లను సందర్శించి వాటి వివరాలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం తయారు చేసిన కోడిగుడ్లు పొదిగే యంత్రాలను ప్రారంభించి రైతులకు పంపిణీ చేశారు. అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం సెక్రటరీ పి.బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం యువత సామాజిక బాధ్యతతో పాటు వ్యవసాయంలో వస్తున్న నూతన సాంకేతికతను అందిపుచ్చు కోవాలన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథం వైపు నడపాలని తెలిపారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలు పండించి అధిక ఆదాయాన్ని పొందాలని సూచించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జెవి.ప్రసాద్ మాట్లాడుతూ సహజ వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులకు అవసరమైన, ధ్రువీకరణ పద్ధతులను, వాటి ద్వారా ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకొని అధిక ఆదాయాన్ని పొందాల న్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పెండేకంటి బాలాజీ, ప్రధాన శాస్త్రవేత్త యూనిటి హెడ్ ధనలక్ష్మి, శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవి గౌడ్, లక్ష్మీ ప్రియ , వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



రైతులకు కోడిగుడ్లు పాడి పొదిగే యంత్రాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయ సాంకేతికత వినియోగ పరిశోధనా సంస్థ డైరెక్టర్

విలేజ్ క్లినిక్‌ల్లో మెరుగైన సేవలు అందించండి

- జిల్లా వైద్య అధికారి డాక్టర్ వెంకటరమణ

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నంద్యాల జిల్లా వైద్య అధికారి డాక్టర్ వెంకట రమణ పేర్కొన్నారు. నంద్యాల మండల పరిధిలోని చాపిరేవుల గ్రామంలోని థమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పాండురంగాపురం గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను డిఎంహెచ్ఒ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాండురంగాపురము విలేజ్ హెల్త్ క్లినిక్ నందు రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ప్రమాదకర సంకేత లక్షణాలున్న గర్భిణులను ముందుగానే గుర్తించి ఉన్నత ఆసుపత్రులకు 108 వాహనము ద్వారా రెఫర్ చేయవలెనని వైద్య, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఆరోగ్యశ్రీ కేసులను క్రమము తప్పకుండా ఫాలోఅప్ చేయవలెనని, లేనిచో కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మాతా శిశు సంరక్షణ సేవలు, హెచ్ఎంఐఎస్ పోర్టల్, సిఎస్ఎస్ఎం పోర్టల్ నందు అప్డేట్ చేయవలెనని ఆదేశించారు.



రోగులతో వైద్య సేవలు తెలుసుకుంటున్న డిఎంహెచ్ఒ



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి అఖిల ప్రియ

వైసిపి కోటకు బీటలు

-100 కుటుంబాలు టిడిపిలోకి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ నియోజకవర్గం దొర్నిపాడు మండలంలోని రామచంద్రపురం గ్రామంలో వైసిపి కోటకు బీటలు వారాయి. వైసిపికి చెందిన 100 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఎంపిటిసి వంక రాధతో పాటు మూల్పూరి దయానందరావు, హరిబాబు, అంజయ్య, శ్రీనివాసరావు,సాయి గోపాల్ రావు గోపి, సాంబశివరావు, ఆదినారాయణ, సాయిబాబా, రమేష్, మరికొన్ని కుటుంబాలు వైసిపిని వీడి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, భార్గవరామ్ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి భూమా అఖిలప్రియ మాట్లాడుతూ రాష్ట్రంలో నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్ర మొదలైనప్పటి నుంచి వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. ఒక్కసారి వైసిపికి అవకాశం ఇస్తామని ప్రజలందరూ గత ఎన్నికల్లో వైసిపికి పట్టం కట్టారనీ, కానీ వైసిపి వచ్చిన తర్వాత పరిపాలన చూసి ప్రజలందరికీ విసుగు పుట్టిందన్నారు. పరిపాలన చేతకాక చివరికి సర్పంచ్ నిధులనూ వాడుకునే పరిస్థితికి ఈ ప్రభుత్వం దిగజారిందని విమర్శించారు. ఎమ్మెల్యే అభివృద్ధి మాట మరిచి, డబ్బు రాజకీయాలకు పాల్పడుతున్నాడని విమర్శించారు.

13న నేషనల్ మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈనెల 13న నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం ఒ ప్రకటన విడుదల చేశారు. చిన్న, చిన్న కారణాలు, తగదాలతో కేసులు నమోదయినావని , ఎక్కువ సమయాన్ని వధా కాకుండా చూసేందుకు సత్వర న్యాయం కొరకు మెగా లోక్ అదాలత్ ఉపయోగ పడుతుందన్నారు. పెండిం గ్‌లో ఉన్న కేసులు రాజీ అయ్యే కేసులు పరిస్కరించే విదంగా పోలీసు అధికారులు, సిబ్బంది బాగా కృషి చేయాలన్నారు.